# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 87 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 11, సురాసుర సంగ్రామం

మహావిష్ణువు ఇచ్చిన సలహా తో దధీచి మహర్షిని ఆశ్రయించి, ఆయన అస్థికలతో వజ్రాయుధం తయారు చేయించుకుని దేవతలమీదకి యుద్ధానికి వెళ్ళారు దేవతలు. అలా వచ్చే దేవతల గురించి విని వృత్రాసురుడు యముడిమీదకి లంఘించే శివుడిలాగా వచ్చాడు సంగ్రామానికి.

చ. అసురులకున్ సురావళికి నయ్యె మహారణ మప్పు డొండొరుల్
ముసల గదాసి కుంత శర ముద్గర తోమర భిందిపాల ప
ట్టిస పటుశూల చక్రముల రేవలు చూపి యదల్చి యార్చుచున్
మసలక కప్పి రస్త్రముల మార్కొని మంటలు మింట నంటగన్. [6-364]

చ. సమజయమున్ సమాపజయ సామ్య పరిశ్రమమున్ సమోరు వి
క్రమము సమాస్త్రశస్త్రబల గర్వము నై కడు ఘోర భంగి నా
నముచి విరోధి సైన్య గణనాథులతోడ నిశాచరేశ్వ రో
త్తములు దురంబుజేసి రొగిఁ దార్కొని వృత్రుబలంబు ప్రాపునన్. [6-371]

పై రెండు పద్యాల్లో సురాసుర యుద్ధం ఎలా జరిగిందో వివరిస్తున్నారు చూడండి. రెండు సైన్యాలు ఎలా ఉన్నాయంటే – సమజయమునన్ – సమాన విజయంతో, సమాపజ సామ్య పరిశ్రమమున్ – సమానమైన అపజయంతో కూడా, సమ పరిశ్రమతో (ఒకేరకంగా కష్టపడుతున్నారు విజయం కోసం), సమాస్త్రశస్త్రబలగర్వమునై – సమానమైన అస్త్ర విద్యాపాటవాలతో. ఈ పద్యంలో ఇంద్రుడి పేరు ఎక్కడ చెప్పాడో పట్టుకోగలరా? నముచి విరోధి – ఇంద్రుడు. అలా ఇంద్రుడి సైన్యం, వృత్రుడి సైన్యం సమానంగా పోరాటం సాగిస్తున్నాయి. ఎటువంటి పోరాటం అంటే ఈ అస్త్రాల వల్ల మంటలు ఆకాశానికి ఎగిసేలాగా (మంటలు మింట నంటగన్).

లగ్రా. మొత్తముగఁ బాఱు పెనునెత్తురు మహానదులఁ;
దత్తరముతో నుఱికి కుత్తుకలు మోవం
జిత్తముల నుబ్బి వెస నెత్తుకొను భూతముల;
నత్తుకొని శాకినులు జొత్తిలుచు మాంసం

బుత్తలముతో మెసఁగి నృత్తములు జేయు మద;
మత్తఘన ఢాకినులు వృత్తగతిఁ బ్రేవుల్
బిత్తరములం దిగిచి మెత్తమెదడుల్ మొనసి;
గుత్తగొనుచుండ భయవృత్తిఁ గల నొప్పెన్. [6-373]

మరోసారి సింగయగారి పద్యాపాటవం ఈ లయగ్రాహి పద్యంలో. నెత్తురు మహానదులలాగా పారుతోంది కుత్తుకలు తెగుతూంటే. ఈ సమయంలో భూత ప్రేతాలు నృత్యం సాగించాయి ఆ మారణహోమంలో. ప్రతీ పాదంలో ప్రాస, యతి గమనించండి ఈ పద్యంలో. మొత్తముగ – పెను నెత్తురు, దత్తరముతో – కుత్తుకలు వగైరా.

ఇలా దేవదానవులు కృతయుగం నుంచి త్రేతాయుగం దాకా దెబ్బలాడుకుంటూనే ఉన్నారు. ఈ లోపుల వృత్రాసురుడి బలం పెరగడం మొదలైంది. అంటే ఏమిటంటే, ఒకసారి నీచపు ఆలోచనలు మనసులోకి రాగానే మంచి ఆలోచనలు మళ్ళీ పూర్తిగా రావడానికి – ఆ అసురభావాలు పోవడానికి, భగవత్కృపతో యుగాల కాలం పడుతుంది. అందుకే జాగ్రత్త అవసరం. ఈ యుగం మారేసరికి వృత్రాసురుడికి బలం ఎందుకు పెరిగింది? ఎందుకంటే యుగాలు మారుతుంటే ధర్మం ఒక్కోపాదం పోగొట్టుకుంటూంటుంది అని మనం విన్నదే కనక.

వ. ఇట్లు సమరతలంబువాసి తన ప్రాపుమాసి, తీసిపఱచుచుండు దండనాయకులం జూచి, యకుటిలమతిం బకపక నగి వృత్రాసురుండు, ఇట్లనియె
[6-380]

ఇలా యుద్ధం జరుగుతూంటే దానవ నాయకులు ఒక్కొక్కరూ యుద్ధంలోంచి పారిపోవడం మొదలుపెట్టారు. ఇది చూసి వృత్రుడు పకపకా నవ్వుతూ అంటున్నాడు ఈ దండనాయకులతో

ఉ. క్షుల్లకవృత్తి మీ కగునె? శూరుల కిమ్మెయిఁ గీర్తి భోగముల్
గొల్లగఁ జేయు చావు మదిఁ గోరినవారల కైనఁ గల్గునే?
తల్లడ మంది యీ సమరధర్మము మాని తలంగఁ బాడియే?
మల్లుఁడు దుర్దమప్రథనమత్తుఁడు వృత్రుని పాటెఱుంగరే? [6-381]

ఇలాంటి నీచ ప్రవృత్తి (క్షుల్లకవృత్తి) మీకు మంచిదేనా? ధీరులకి కీర్తి, భోగాలు కలిగించే వీరమరణం కావాలంటే అందరికీ రాదు కదా? అది మర్చిపోయి పారిపోతున్నారే, అదీగాక మహావీరుడైన వృత్రుడి బలం/సామర్థ్యం గురించి తెలియదా? (మల్లుఁడు దుర్దమప్రథనమత్తుఁడు వృత్రుని పాటెరుంగరే?). ఇంకా జీవిత సత్యాలు చెప్తూ వృత్రుడు; ఏమంటున్నాడంటే,

క. చావు ధ్రువమైన ప్రాణికిఁ
జావులు రెం డరసికొనుఁడు సమరమునందున్
భావింప యోగమందును
జావంగా లేని చెడుగుచావుం జావే? [6-382]

చావు నిశ్చయమైన ప్రాణికి రెండే రెండు మంచి దారులున్నాయి. ఒకటి రణరంగంలో వీరమరణం చెందడం. రెండోది యోగమార్గంలో శరీరం విడవడం. ఈ రెండు దార్లు కానివి అతి నీచమైన మార్గాలు. ఈ పద్యంలో వృత్రుడు తనకి తెల్సిన అధ్యాత్మ సత్యాలు చెప్తున్నాడు. ఇవి వృత్రాసురుడి వంటి రాక్షసుడికి – ఇంద్రుడు సైతం ఆశ్చర్యపోయే ఈ విషయాలు – ఎలా తెలిసాయా అనేది ముందు ముంది తెలుస్తుంది.

అలా దండనాయకులని వెనక్కి తిప్పి మరోసారి యుద్ధానికి తయారయ్యాడు. ఈ లోపుల తన మీదకి ఐరావతం మీద వచ్చిన ఇంద్రుడినీ ఐరావతాన్నీ చేత్తో పట్టుకుని విసిరేశాదు.

ఆ. అగ్గజంబు గులిశహతిఁ గూలు కులమహీ
ధ్రంబుఁ బోలె రక్తధార లురల
మస్తకంబు పగిలి మదమఱి జిరజిరఁ
దిరిగి భీతితోడఁ దెరలి పఱచె. [6-388]

ఆ దెబ్బకి ఐరావతం నెత్తురు కక్కుకుంటూ పరుగుతీసింది. ఇలా వాహనం పడిపోతే ఇంద్రుడు ఏమి చేయగలడు? దెబ్బతిన్న ఐరావతాన్ని ఊరడించి మళ్ళీ యుద్ధానికి తయారవ్వాలి కదా? ఇలా ఊరడించి ఐరావతాన్ని ఉత్సాహ పరచడాన్ని సింగయ కిందన ఉత్సాహ వృత్తం పద్యంలో రాసాడు చూడండి.

ఉత్సా. గజము దెరలి దాని కొఱలి కంప మొంది పాఱఁగా
భజన నింద్రుఁ డంకుశమునఁ బట్టి బిట్టు నిల్పుచున్
నిజసుధారసైకపాన నిర్ణ యార్ద్ర కరమునన్
బుజత మీఱ నిమిఱె నదియు రీతి మెఱసి క్రమ్మఱన్. [6-389]

ఇంద్రుడు అమృతం తాగినవాడు కనక అలా పారిపోయే ఐరావతాన్ని తన చేత్తో (నిజ సుధారసైకపాన నిర్ణ యార్ద్ర కరము) నిమురుతూ అంకుశంతో అదుపులోకి తీసుకొచ్చాడు. ఇది చూసి వృత్రాసురుడు అంటున్నాడు.

శా. నాకుం బెద్దయు నీకు సద్గురువు దీనవ్రాత రక్షున్ శుభా
లోకుం జంపితి విట్లు పాపమతివై లోభంబుతో నియ్యెడన్
లోకుల్ నవ్వఁగ మద్భుజాపటిమకున్ లోనైతి వీ శూలమం
దాకంపింపఁగ నిన్ను గ్రుచ్చి ఋణముక్తాత్ముండనై పేర్చెదన్. [6-391]

విశ్వరూపుడు నాకు పెద్ద అన్న, నీకు సద్గురువు; నీకూ, అందరికీ శుభం కలిగించిన అటువంటివాడిని లోభంతో చంపావు. ఈ శూలాన్ని నీ గుండెల్లో దింపి నా అన్న ఋణం తీర్చుకుంటాను.

మహాస్రగ్ధర. హరిపై సర్వాత్ముపై నత్యగణితగుణుపై నంతరంగంబు పర్వన్
సరిమేనుప్పొంగఁ జావుంజయమును సరిగాసంతసంబందుచుం భీ

కరుఁడై కాలాగ్ని పోలెం గనులుచుఁ గవిసెన్ గర్వదుర్వారుఁడై దు
ర్భరలీలన్ భూమి గంపింపఁగ దిశల ద్రువన్ భండనోద్దండవృత్తిన్. [6-403]

నీకు చాతనైతే ఆ వజ్రాయుధం ప్రయోగించు. విష్ణుదేవుడి సలహాతో సంపాదించిన ఆ వజ్రాయుధం మహత్తరమైనది కనక నేను విష్ణుపాదాలు స్మరిస్తూ ప్రాణం విడిచేస్తాను. అలా అంటూ శ్రీహరి మీద మనసు లగ్నం చేసి వృత్రాసురుడు ఇంద్రుడిమీదకి లంఘించాడు. ఇక్కడ ఇంద్రుడి చేతిలో వజ్రం ఉన్న మాట వాస్తవమే కానీ వృత్రాసురుడు యుద్ధంలో ఉన్నా మనసు మాత్రం భగవంతుడిమీద ఉండడం గమనించవచ్చు. పద్యం వృత్తం ఏమిటో గమనించారా? అంతులేని భగవంతుడి వైభవం గురించి చెప్తూ, విజయాపజయాలు ఒకటే అని వృత్రుడు అన్నట్టూ రాసిన పద్యానికి వాడిన వృత్తం మహాస్రగ్ధర.

ఆ. గజముపాటు చూచి కడు దీనగతిఁ జూచి
పరికరంబు జాఱి పడుటఁ జూచి
యుద్ధధర్మ మెఱిఁగి యున్న శత్రునిఁ జూచి
సిగ్గుతోడ వజ్రి శిరము వాంచె. [6-411]

వ. ఇట్లు యుద్ధంబున శత్రు సన్నిధిం గరంబు జాఱిపడిన వజ్రంబుఁ బుచ్చికొనక నివ్వెఱపడి, లజ్జించి యున్న పాకశాసనుం జూచి వృత్రుం డిట్లనియె.
[6-412]

అలా జరిగిన యుద్ధంలో ఇంద్రుడి పరికరం – వజ్రాయుధం, చేతిలోంచి జారి కింద పడింది. అయితే ఇదే అదనుగా వృత్రాసురుడు ఇంద్రుణ్ణి చంపలేదు. యుద్ధ ధర్మం పాటించి అలా వినోదంగా చూస్తూ సిగ్గుతో చేతిలో ఏమీ ఆయుధంలేకుండా నిల్చున్న ఇంద్రుణ్ణి చూసి వృత్రుడు అంటున్నాడు.

క. దురమునఁ గైదువు వదలిన
శరణన్నను వైరిజనులఁ జంపరు వీరుల్
వెఱఁగంద నేల? కులిశము
కర మరుదుగఁ బుచ్చికొనుము కాచితి నింద్రా! [6-413]

యుద్ధంలో (తురమున) ఆయుధాలు విసర్జించినవారినీ, శరణు అన్నవారినీ వీరులు/శత్రువులు చంపరు. భయపడకుండా, నీ ఆయుధం తీసుకో, నేను వేచి ఉన్నాను. నీ వజ్రాయుధంతో నన్ను కడతేర్చు. ఈ విషయం వృత్రుడు దేవేంద్రుడితో చెప్పడం చూస్తే, మనకి తెలిసేదేమంటే, వృత్రుడికి తాను వజ్రాయుధంతో పోతాడని ముందే తెలుసు. అలా పోవడం మంచిదే అని కూడా తెలుసు. ఇంకా అంటున్నాడు.

తే. మెఱయ యంత్రమయం బైన మృగము భంగి
దారునిర్మితమైనట్టి తరణిపోల్కి
శక్ర! యెఱుఁగుమ యీ భూతజాల మెల్ల
దళిత పంకేరుహాక్షు తంత్రంబు గాఁగ [6-415]

ప్రపంచంలో జనం ఏదో కొంచెం విజయం కలగగానే (నేను నీ చేతిలో ఆయుధం పడగొట్టినట్టుగానే) అంతా మర్చిపోయి అది వాళ్ళ స్వంత విజయంగా భావిస్తున్నారు అందరూను. కానీ యంత్ర నిర్మితమైన జంతువులలాగా, కొయ్య చెక్కతో చేసిన పడవల్లాగా ఈ భూతజాలం అంతా భగవంతుడి చేతిలో కీలుబొమ్మలని తెలుసుకో.

వ. మఱియు; భూతంబులచేతను, నింద్రియంబులచేతను, నవశుండైన పురుషుండు ప్రకృతిచేత వేఱుచేయంబడిన యాత్మం బరమేశ్వరానుగ్రహంబు వాసి సుఖియించుచుండు; నవిద్వాంసుండైన వాఁ డనవరతంబుఁ దన్ను స్వతంత్రుంగాఁ దలంచుచుండు; భూతంబుల వలన భూతంబులు పుట్టుచుండును; నా భూతంబులు భూతంబులచేత భక్షింపబడుచుండు; పురుషున కాయువు, శ్రీయును, గీర్తియు, నైశ్వర్యంబును మొదలైనవి యనుభవింప నెంతగాలంబు ప్రాప్తం బంత గాలంబు నివసించు, ప్రాప్తంబు దీఱినఁ బురుషుండు జాలిం బొందిన నవి యుండక పోవుచుండును; కావున గుణంబును నవగుణంబును గీర్త్యప గీర్తులును, జయాపజయంబులును, సుఖదుఃఖంబులును, జావుబ్రతుకులును, సమంబులై కలుగుచుండు; నజ్ఞాని యైన వానికి సత్త్వరజస్తమో గుణంబులు గలిగి యుండు; నట్టివానికి గుణమయంబులైన యింద్రియాదులే యాత్మ యని తోఁచుచుండును; కావున వాఁ డా గుణంబులచేత బద్ధుం డగు; నా గుణంబులకు సాక్షి మాత్రంబగు శరీరంబు వేఱని యెవ్వఁ డెఱుంగనోపు, వాఁ డా గుణంబులచేత బద్ధుండు గాఁడు; కావున గుణంబులును, గుణియు, భోక్తయును, భోగ్యంబును, జయంబును, నపజయంబును, హర్తయును, హార్యంబును, నుత్పత్తిస్థితిలయకర్తయై, సర్వోత్కృష్టుండైన యప్పరమేశ్వరుండె కాని యన్యంబు లేదు; ఇప్పు డొక్క హస్తంబు నాయుధంబునుం బోయినను భవత్ప్రాణాహరణంబునకు సమర్థుండ నగుచున్న నన్నుం జూడు" మని వృత్రాసురుండు మఱియు నిట్లనియె. [6-416]

ఈ యుద్ధంలో ఇంద్రుడి దెబ్బకి వృత్రాసురుడి చేయి తెగి పడింది. అయినా యుద్ధం చేస్తూ చెప్తున్నాడు ఇంద్రుడితో జీవితం అంటే ఏమిటో. ఈ వచనం సులభంగానే అర్ధం అవుతుంది. చివరి రెండు వ్యాక్యాలు మాత్రం జీవితంలో మాయ అనేది వివరిస్తాయి. గుణాలు, భోక్త, భోగ్యం ఏదైనా సరే పరమేశ్వరానుగ్రహమే కానీ మరోకటి కాదు (ఇదే భగవద్గీతలో చెప్పిన "ఈ చరాచర ప్రపంచంలో నేను లేకుండా నిలబడగలిగేది ఏదీ లేదు" అనేది. యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున, న తదాస్తి వినా యస్యాన్ మయా భూతం చరాచరం. భగవద్గీత 10.38), కానీ మాయ అనేది తెలుసుకోవడం అసంభవం. దీనికి ఉదాహరణ ఏమిటంటే, నా చేయి తెగిపోయింది అయినా నిన్ను చంపడానికి తయారౌతున్న నేనే.

చ. అనవుడు వృత్రుమాటలకు నద్భుత మంది సురేంద్రుఁ డెంతయుం
దన మదిఁ గుత్సితం బుడిగి దైవముగా నతనిన్ భజించి కై
కొనియెఁ గరంబునన్ దిగువఁ గూలిన వజ్రము, నప్పు డాత్మలోఁ
దనరె జగంబు లన్నియు ముదంబునఁ బొందిరి ఖేచరావళుల్. [6-418]

ఇలా చెప్పిన వృత్రాసురుడి మాటలకి ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు. కిందపడిన వజ్రం అందుకుని పైకి చూసేసరికి వృత్రుడు భగవంతుడిలాగా కనిపించాడు.

వచ్చే వ్యాసంలో వృత్రాసురుడి చావు, అక్కడనుంచి అతని క్రితం జన్మా అనే విషయాలు చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS